క్లుప్తంగా

మాజీ సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాఘవరెడ్డి

నకరికల్లు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రెంటపాళ్ల పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి మంగళవారం పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్లకు చేరుకొని శివ నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాజీ సీఎం జగన్ పాల్గొంటారని అన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముప్పాళ్ల: మండలంలోని విద్యుత్ ఉప కేంద్రం 11 కేవీ పరిధిలోని దమ్మాలపాడు ఫీడర్ లైన్ మరమ్మతుల్లో భాగంగా పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 18వ తేదీ బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ జీ సుచరిత మంగళవారం తెలిపారు. ఫీడర్ పరిధిలోని బొల్లవరం, దమ్మాలపాడు, రుద్రవరం, పలుదేవర్లపాడు, నార్నెపాడు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గరికపాడులో 'గ్రాడ్యుయేషన్ డే'



గరికపాడు(క్రోసూరు): మండలం 88త్యాళ్లూరు సెక్టార్ పరిధిలోని గరికపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం, స్కూల్ రెడీనెస్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ సయ్యద్ మైమున్నీసా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడు సంవత్సరాల చిన్నారులకు అక్షరాభ్యాసం, ఐదు సంవత్సరాల పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కొత్త పిల్లలను జాయిన్ చేసుకోవడం జరిగింది. కార్యక్రమంలో గరికపాడు సర్పంచ్ అంకమ్మ, యూత్ లీడర్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి



సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామానికి బుధవారం రానున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్ జగన్ రాకను పురస్కరించుకొని మంగళవారం రెంటపాళ్ల గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. గత ఏడాది జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుండగా ఫలితాలు కూటమికి అనుకూలంగా ఉన్నట్లు తెలియడంతో వైఎస్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్త, రెంటపాళ్ల ఉప సర్పంచ్ కొర్లకుంట నాగమల్లేశ్వరరావు ఇంటిపై కూటమి నేతలు దాడులకు పాల్పడ్డారన్నారు. మరోవైపు సత్తెనపల్లి రూరల్ పోలీసుల వేధింపుల కారణంగా మనస్థాపం చెందిన నాగమల్లేశ్వరరావు గత ఏడాది జూన్ 6న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ గత ఏడాది జూన్ 9న మృతి చెందాడన్నారు. నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం కల్పించి భరోసా అందించేందుకు జగన్‌మోహన్ రెడ్డి రానున్నారన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జగన్‌మోహన్ రెడ్డికి ఘన స్వాగతం పలకాలని కోరారు.

పచ్చిరొట్ట పైరులు భూమిలో కలియదున్నాలి



మాట్లాడుతున్న ఏవో సుబ్బారెడ్డి



రైతులకు సూచనలిస్తున్న ఏవో దేవదాసు



దుక్కులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

సత్తెనపల్లి: పచ్చిరొట్ట పైరులు భూమిలో కలియదున్నాలని సత్తెనపల్లి మండల వ్యవసాయధికారి బి.సుబ్బారెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం పెద మక్కెన, గర్నెపూడి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పత్తి, మిరప, వరి పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట పైరులైన జనుము, జీలుగ, పిల్లిపెసర సాగు చేసి పూత దశలో భూమిలో కలియ దున్నుకోవాలని సూచించారు. కౌలు రైతులు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా భూ యజమానుల అంగీకారంతో పంట సాగు హక్కుపత్రాలు పొందాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకంకు అర్హత కలిగిన రైతుల వివరాలు ప్రభుత్వం ఈ కేవైసీ ఆటో అప్డేట్ చేయటం జరిగిందన్నారు. రైతులు అధీకృత డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలని, మిరప సాగు చేసే రైతులు షేడ్ నెట్‌లలో నారు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

క్రోసూరు: వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం నుంచి మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏవో వేణుగోపాల్ తెలిపారు. తొలిరోజు క్రోసూరు, అందుకూరు గ్రామాల్లో నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఏవో వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొని వివిధ ప్రభుత్వ పథకాల వివరాలను తెలియజేయడమే కాక, క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి యాజమాన్య పద్ధతులను తెలియజేస్తారని అన్నారు. పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ పథకంకు రైతులు బుధవారం లోపు ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఏవో వెంకటనర్సయ్య

అధీకృత దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి

నకరికల్లు: వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన అధీకృత దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు సూచించారు. మండలంలోని గుండ్లపల్లి, బాలాజీనగర్‌తండా గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన దుకాణం నుంచి తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. రసీదుపై పంట రకం, లాట్ నంబర్, రైతు, అమ్మకందారుని సంతకం ఉండాలన్నారు. మొలక శాతం పరీక్షించి విత్తనాలనే కొనుగోలు చేసుకోవాలన్నారు. విత్తనాలను నారుమడిలో చల్లే ముందు తప్పనిసరిగా శుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.సంధ్యారాణి, రైతులు పాల్గొన్నారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్త వహించాలి

అమరావతి: మండలంలోని అమరావతి, ధరణికోట గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి క్రోసూరు వ్యవసాయ సహాయ సంచాలకులు వి.హనుమంతురావు మాట్లాడతూ రాబోయే ఖరీఫ్ సాగుకు అనుగుణంగా రైతులు భూమిని సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులు తమ ప్రాంతానికి అనుకూలమైన రకాలను మాత్రమే ఎంపిక చేసుకోవాలని, విత్తన కొనుగోలులో తగిన జాగ్రత్తలు పాటించాలని తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. రసీదులో లాట్ నెంబరు, విత్తన రకం, రైతు, అమ్మిన వారి సంతకం ఉండాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన వారి వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. రైతులు భూమిలో తగిన తేమ ఉన్నప్పుడు విత్తనాలు విత్తాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో అహ్మద్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విత్తనాలు కొనుగోలు చేసి బిల్లులు పొందాలి

రాజుపాలెం: రైతులు దుక్కులు దున్నుకుని పచ్చిరొట్ట ఎరువులను వేసుకొని భూసారాన్ని పెంపొందించుకోవాలని ఏవో పి.వెంకటనర్సయ్య తెలిపారు. మండల పెదనెమలిపురిలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు ఖరీఫ్ సీజన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ లైసెన్సు కలిగిన షాపులోనే నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి తగిన రసీదు తీసుకోవాలని తెలిపారు. రసీదుతో కేళీలు, నకిలీలు ఉన్నట్లయితే నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. కౌలు రైతులు కౌలు రైతు కార్డులు పొందాలని, అన్నదాత సుఖీభవకు రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ ముస్తాక్, ఎంపీఈవో భవాని, రైతులు పాల్గొన్నారు.

అతిసారంపై అప్రమత్తత అవసరం

పీహెచ్‌సీ వైద్యాధికారి రమాదేవి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యురాలు రమాదేవి

ముప్పాళ్ల: అతిసారం పట్ల అప్రమత్తతే సురక్షితమని, అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకమని పీహెచ్‌సీ వైద్యురాలు పీ రమాదేవి చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అతిసార వ్యాధి నియంత్రణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రమాదేవి మాట్లాడుతూ జూలై 31వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లోను అతిసార వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. అతిసార వ్యాధి మరణాలు లేకుండా చేయటమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. అతిసార రాకుండా ఉండాలంటే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఎల్లప్పుడూ మరుగుదొడ్డిని ఉపయోగించాలని సూచించారు. చిన్నపిల్లల్లో అతిసార లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఏ పీటర్‌డేమియన్, ఎం.జోస్పిన్‌రాణి, స్టాఫ్‌నర్స్ రాధ, కామాక్షి, ఏఎన్ఎం .జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియా క్యాంపెయిన్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరించిన వైద్యులు, సిబ్బంది

క్రోసూరు: అతిసారం వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు జూలై 31వ తేదీ వరకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారులు డాక్టర్ సిరి చందన, డాక్టర్ రాంబాబునాయక్, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్‌లు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలోని సమావేశ హాలులో మంగళవారం 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ' పోస్టర్లను ఆవిష్కరించారు. డాక్టర్ సిరి మాట్లాడుతూ వర్షాకాలంలో కలుషిత నీటి కారణంగా అతిసారం ప్రబలే అవకాశం ఉందని, దీని కారణంగా మరణాలు ముఖ్యంగా ఐదు సంవత్సరాలలోపు పిల్లల మరణాలు సంభవించకుండా నివారించడం జిల్లా యంత్రాంగం లక్ష్యమని అన్నారు. డాక్టర్ రాంబాబు నాయక్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు 2 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జానీబాషా, మేల్ స్టాఫ్‌నర్స్ వీరయ్య, ఫార్మసిస్ట్ ఫాతిమా, ఆరోగ్య,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎత్తిపోతల అడహక్ కమిటీ చైర్మన్‌గా రాజన్‌బాబు

అచ్చంపేట: మండలంలోని గ్రంథశిరి ఎత్తిపోతల పథకానికి అడహక్ కమిటీ చైర్మన్‌గా సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబును నియమిస్తూ ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం రాజన్‌బాబు ఉత్తర్వుల కాపీలను విలేకరులకు చూపించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు 2025 ఖరీఫ్ సీజన్ నాటికి స్కీము మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు సకాలంలో సాగునీరు అందిస్తామన్నారు. ఇప్పటికే మరమ్మతు పనులు జరుగుతున్నాయని, విద్యుత్ శాఖాధికారుల సహకారంతో స్కీముకు విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపడతానన్నారు.

నోటీసులు ఇవ్వకుండా అడహక్ కమిటీ..

అడహక్ కమిటీని వేసేటప్పుడు సంబంధిత ఇరిగేషన్ శాఖ నుంచి తనకు ఎలాంటి నోటీసులు అందలేదని, నోటీసులు ఇవ్వకుండా, తన నుంచి వివరణ తీసుకోకుండా ఎలా అడహక్ కమిటీ వేస్తారని ప్రస్తుత చైర్మన్ రావెళ్ల నరసింహారావు ప్రశ్నించారు.

వృద్ధుల పరిరక్షణకు అనేక చట్టాలు

ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు

సత్తెనపల్లి: వృద్ధుల పరిరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. గుంటూరు జిల్లా న్యాయసేవాధికర కమిటీ చైర్మన్ ఆదేశాల మేరకు, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ జడ్జి) వి.విజయ్ కుమార్ రెడ్డి సూచనల మేరకు ఈ నెల 15 తేదీ నుంచి 19 వరకు వృద్ధుల వేధింపుల నివారణపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా మంగళవారం పట్టణంలోని మాతృశ్రీ మొల్లమాంబ అనాథ వృద్ధుల ఆశ్రమంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఆశ్రమంలో ఎంత మంది వృద్ధులు ఉన్నారు.. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చట్టపరమైన అవసరాలు తలెత్తితే సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీకి తెలియజేయాలని, ఆశ్రమ స్థాపకులు ఆరేపల్లి కొండలకు సూచించారు. కేవలం ఒక్క ఫోన్ కాల్ ద్వారా అవసరమైన న్యాయ సేవలు అందించబడతాయన్నారు. శ్రీనివాసరావు వృద్ధుల పరిరక్షణ చట్టాల గురించి తెలిపారు. ఆశ్రమ వ్యవస్థాపకులు, పారాలీగల్ వలంటీర్లు, వృద్ధులు ఉన్నారు.